APTEL/2008/28200

## నిలిచిపోయిన మెట్రో ట్రైన్స్

హైదరాబాద్, జూన్ 7 : హైదరాబాద్ మెట్రో రైళ్లు మియాపూర్ – ఎల్బీ నగర్ మార్గంలో నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతోనే రెడ్ లైన్‌లో రైళ్లను నిలిపివేసినట్లుగా మెట్రో రైలు లోకో పైలట్లు చెబుతున్నారు. హైదరాబాద్ లో అసలే భారీ వర్షం కురియడంతో విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో చాలా మంది రోడ్డు మార్గం ద్వారా కాకుండా మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇంతలో రైళ్ల రాకపోకలు ఆగిపోవడంతో స్టేషన్లు అన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అటు ఎల్బీ నగర్ మెట్రోలో ఎగ్జిట్ మెషిన్లు కూడా పని చేయడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. దాంతో ప్రయాణికులు బయటకు వెళ్లలేకపోతున్నారు.అయితే, వెంటనే సమస్యను పరిష్కరించినట్లుగా ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ప్రకటించింది. ఓ చిన్న లోపం కారణంగా రైళ్లు నిలిచాయని.. ఆ సమస్యను 7 నిమిషాల్లోనే పరిష్కరించామని వెల్లడించింది.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## ఆర్ట్ ఫెస్టివల్ ను ప్రారంభించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్ : గుడిమల్కాపూర్ లోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్ సెంటర్ లో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. కళా ప్రియులైన హైదరాబాద్ వాసులను అలరించేందుకు 7 నుండి మూడు రోజుల పాటు ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజేంద్ర పాటిల్, ఎం వి రమణ రెడ్డి, దివ్య రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ యేటా ముంబై, బెంగళూరు నగరాలలో నిర్వహించే అతి పెద్ద అయినా ఈ ఆర్ట్ ఫెస్టివల్ మొదటి సారి హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడ్డి మల్కాపూర్ లోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్ సెంటర్ లో మూడు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. దేశ వ్యాప్తంగా 250 మంది కళాకారులు, 30 ఆర్ట్ గ్యాలరీలు, 3500 కళాఖండాలను కళాప్రియులను అలరించేలా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సంపుటి: 16 సంచిక : 37 కరీంనగర్ శనివారం, జూన్ 08, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# ‘ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ’

## పేదరిక నిర్మూలనే మా అజెండా

### మిత్రపక్షాల నేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక



చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. పవన్ అంటే పవన్ కాదు ఒక తుఫాన్ అన్నారు. ఏపీలో చంద్రబాబు చారిత్రాత్మక విజయం సాధించారన్నారు. పవన్ వల్లే ఏపీలో భారీ విజయం లభించిందని కీర్తించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ముందుగా ఎన్డీయే మిత్రపక్షాల కార్యకర్తలకు శిరసువంచి నమస్కరిస్తున్నానన్నారు మోదీ. ఎన్డీయే గెలుపుకు శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు. ఇవాళ పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్డీయేపక్ష నేతగా నరేంద్రమోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదిస్తే అమిత్‌షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. ఎన్డీయేపక్ష నేతగా 3వ సారి ఎన్నికైన నరేంద్రమోదీ.. ప్రధానిగా సేవలు అందించబోతున్నారు. ఎన్డీయే పక్ష సమావేశానికి హాజరైన మోదీ.. రాజ్యాంగానికి ప్రణామం చేసి ఉద్వేగంగా కనిపించారు. ఆ తరువాత పార్లమెంటరీ పక్షనేతగా ప్రసంగించిన మోదీ కార్యకర్తలను ఆకాశానికి ఎత్తేశారు. 22రాష్ట్రాల్లో ఎన్డీయే మిత్రపక్షాలు కలిసి ఉన్నాయన్నారు. విశ్వాసం అనే బంధం తమను కలిపిందని అన్నారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తల గురించి ఎంతచెప్పినా తక్కువే అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం నడపడానికి అందరి సహకారం అవసరం అన్నారు. అందుకే మిత్రపక్షాల మద్దతు తీసుకున్నానన్నారు.గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎక్కువగా ఉన్నారన్నారు. తనపై నమ్మకంతో దేశ బాధ్యతలు అప్పగించారన్నారు. భారత స్ఫూర్తికి మన ఎన్డీయే కూటమి ఉదాహరణ అన్నారు. ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ అని కొనియాడారు. ఎన్నికలకు ముందే కూటమి గట్టి విజయం సాధించడం ఒక గొప్ప చరిత్ర అన్నారు. ఇవి నాకు భావోద్వేగ క్షణాలని వివరించారు. ఏపీలో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక విజయం అందించారన్నారు. తెలుగురాష్ట్రాల్లో ప్రజలు ఎన్డీయేని బలపరిచారని చెప్పారు. గెలుపును ఎంత ఆస్వాధిస్తామో, పరాజితులను కూడా అంతే గౌరవిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలను విమర్శించారు. తమిళనాడులో ఎన్డీయే కూటమికి సీట్లు రాకపోవచ్చు.. అక్కడ ఏం జరుగుతుందో ముమ్ముందు ఉంటుందని చెప్పారు. ఇక విజయం సాధించి ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉన్న 10 రాష్ట్రాల్లో ఎన్డీయేకు అత్యధిక స్థానాలు ఇచ్చారన్నారు. అలాగే ఆదివాసీలు ఎక్కువగా ఉన్న 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు. క్వాలిటీ ఆఫ్ లైఫ్, గుడ్ గవర్నెన్స్ అందిస్తామని మాట ఇచ్చారు. ఇదే ఎన్డీయే స్ఫూర్తి అని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా దేశంలో ఎన్డీచే కూటమి నడుస్తోందని చెప్పారు. పేదరిక నిర్మూలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గత పదేళ్లలో పేదరికాన్ని నిర్మూలించామన్నారు. రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధికి, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు, కూటమి నేతలు మోదీకి సాదర స్వాగతం పలికారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నితీష్ సహా 9 మంది ఎన్డీయే మిత్రపక్షాల నేతలు వేదికపై ఉన్నారు. దీంతో ఇవాళ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సందడి వాతావరణం కనిపించింది. కూటమి నేతలతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, ముఖ్యనేతలు కూడా హాజరయ్యారు.

## సీఎంవోలో భారీగా మార్పులకు రంగం సిద్ధం..

### కసరత్తు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి




మొన్నటిదాకా ఎలక్షన్ కోడ్. ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పాలనాయంత్రాంగం ప్రక్షాళనకు టైమే దొరకలేదు. అందుకే పార్లమెంట్ ఎన్నికలు అయిపోగానే పాలనపై ఫుల్ ఫోకస్ పెట్టింది కాంగ్రెస్ సర్కార్. సీఎంవోలో మార్పులకు కసరత్తు చేస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణలో ఉన్నతాధికారుల బదిలీలు భారీగా ఉండబోతున్నాయా? సీఎంవోలో కీలక బాధ్యతలు మారబోతున్నాయా? ఎలా ఉండబోతోంది రేవంత్ మార్క్ అఫీషియల్ టీం. ఎన్నికల కోడ్ ముగియడంతో పాలనపై ఫోకస్ చేయబోతోంది రేవంత్ సర్కార్. ఇందు కోసం అన్ని శాఖల్లో కీలక అధికారులను మార్చేయాలని ప్లాన్ చేస్తోంది. టాప్ టూ బాటమ్ అన్నట్లు అందరిని రిషఫిల్ చేయాలనే ఆలోచనలో ఉంది తెలంగాణ ప్రభుత్వం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ల వరకు మార్చేందుకు కసరత్తు చేస్తోంది. సీఎంవో తోపాటుగా మిగిత అన్ని కీలక విభాగాల్లో మార్పులు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిసెంబరు నెలలో తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. పాలనపై పట్టు సారించేలోపే పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చేసింది. మార్చిలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గత ప్రభుత్వ హయాంలో పని చేసిన అధికారులనే కొనసాగించారు. దీంతో పాటుగా చాలా శాఖల్లో ఖాళీగా ఉన్న అధికారులను భర్తీ చేయాల్సి ఉంది. అధికారం మారిన వెంటనే ఉన్నతాధికారులను మార్చుస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు రేవంత్ సర్కార్. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో బదిలీలపై ముఖ్యమంత్రి పోకస్ చేశారు. ఇప్పటి వరకు జంబో ట్రాన్సఫర్స్ చేయకపోవడంతో ఈసారి భారీగానే బదిలీలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ భారీగా మార్పులు చేర్పులు ఉంటాయని సమాచారం. వివిధ డిపార్ట్‌మెంట్లు, ఇతర రాష్ట్రాల నుండి డిప్యూటేషన్‌లో అధికారులను తీసుకువచ్చి సీఎంవోలో ఓఎస్డీలు, సెక్రటరీలుగా నియమించారు. పలు శాఖల బాధ్యతలను అప్పగించారు. కానీ ముఖ్యమంత్రి ఆశించిన స్థాయిలో వారి పెర్ఫామేన్స్ లేదనే టాక్ నడుస్తోంది. సీఎం స్వయంగా చెబితే తప్పా ఫైలు మూవ్ కావడం లేదనే ప్రచారం సచివాలయ వర్గాల్లో, మంత్రుల్లో, ఎమ్మెల్యేల్లో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలోనే అధికారుల మార్పు తథ్యంగా కనిపిస్తోంది. ఇక సీఎంవో అధికారుల్లో కీలక మార్పులు జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సీఎం ప్రిన్సిపల్ సెక్రటరిగా ఉన్నా శేషాద్రి కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నట్లు సమాచారం.

## ప్రభుత్వ ఏర్పాటుకు మోదీని ఆహ్వానించిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జూన్ 07: కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు నరేంద్ర మోదీని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానించారు. శుక్రవారం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోదీ కలిశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీని ముర్ము కోరారు. అయితే జూన్ 9వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు పలువురు ఎంపీలతో కేంద్రమంత్రులుగా రాష్ట్రపతి ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. మరోవైపు ఈ రోజు ఉదయం పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు సమావేశమయ్యారు. ఆ క్రమంలో తమ పార్లమెంటరీ పార్టీ నేతగా నరేంద్ర మోదీని వారంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే మోదీ కేబినెట్‌లో భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూ, లోక్ జనశక్తి రామ్ విలాస్ పాశ్వాన్, శివసేన షిండే పార్టీలకు చెందిన ఎంపీలకు చోటు దక్కే అవకాశం ఉంది. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో బీజేపీకి కేవలం 240 స్థానాలే వచ్చాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 272 స్థానాలు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాలను కలుపుకోవడంతో.. ఎన్డీయే కూటమికి 275 సీట్లు వచ్చినట్లు అయింది.

## కవిత కస్టడీ పొడిగింపు




న్యూఢిల్లీ, జూన్ 7 : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత సీబీఐ జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగియగా.. ఈ కేసులో కవిత్ర పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్ ను దాఖలు చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీటుపై మధ్యాహ్నం 2 గంటలకు రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. సీబీఐ వాదనలు విన్న కోర్టు.. కవితకు సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించింది. జూన్ 21 వరకూ కస్టడీని పొడిగిస్తున్నట్లు తెలిపింది.సీబీఐ చార్జిషీట్ ను పరిగణలోకి తీసుకున్న కోర్టు.. ఈ కేసులో తదుపరి విచారణ జూన్ 21కి వాయిదా వేసింది. అప్పటి వరకూ ఆమె తీహార్ జైల్లోనే ఉండనున్నారు. కాగా.. తనకు జైల్లో చదువుకునేందుకు పుస్తకాలు కావాలని కవిత కోర్టును కోరగా.. అందుకు అంగీకరించింది. కవిత చదువుకునేందుకు కావాలని కోరిన 9 పుస్తకాలను అందించాలని జైలు అధికారులకు సూచించింది.మరోవైపు ఈడీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ జులై 3 వరకూ ఉంది. రిమాండ్ లో ఉన్న కవితను.. ఈడీ

## జ్యుడీషియల్ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు..

### మంత్రి ఉత్తమ్ స్ట్రాంగ్ వార్నింగ్



జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిన్నటి వరకూ పార్లమెంట్ ఎన్నికలతో కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ సాధ్యం కాలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన మరుసటి రోజే కాళేశ్వరం బ్యారేజ్ పనులను పరిశీలించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరూపయోగంగా ఉందని.. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 90వేల కోట్లకు అదనంగా వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇండియాలోనే అత్యున్నత సంస్థ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ ఈ పనులను పర్యవేక్షిస్తుందని అన్నారు.కాళేశ్వరం డ్యామ్ పునరుద్ధరణ సాధ్యమా కాదా అని అడిగామన్నారు. ఆ కమిటీ అధికారులు బ్యారేజ్‌లపై కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని చెప్పిందన్నారు. వర్షాకాలంలో వరదలు రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం నీళ్లు స్టోరేజీ చేయొచ్చని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. %చీణూూ% కమిటీ మాత్రం అలా చేస్తే ప్రమాదమని చెప్పారన్నారు. బ్యారేజ్ మరమ్మతు పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. సుందిళ్లలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా గతంలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులను తొలగించామని తెలిపారు. జ్యుడీషియల్ విచారణ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టి నీళ్లలో పోశారని మండిపడ్డారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి కట్టి ఉంటే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టకు నీళ్లు వచ్చేవని చెప్పుకొచ్చారు.

## మోదీ వెంటే కలిసి నడుస్తాం..


### ఎన్డీఏ పక్ష సమావేశంలో నితీశ్



ఢిల్లీ: ఎన్డీఏ పక్షనేతగా ప్రధాని మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, మిగతా ఎన్డీఏ పక్ష సభ్యులు మోదీని బలపరిచారు. ఈ సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ “ఏ సందర్భంలోనైనా వేం మీతోనే(మోదీ) ఉంటాం. ఇండియా కూటమి నేతలు ఈ సారి పొరపాటున గెలిచారు. దేశం కోసం వారేమైనా చేశారా? వారంతా వచ్చే ఎన్నికల్లో ఓడిపోతారు. దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్తుంది. మీ నేతృత్వంలో మేమంతా కలిసి పని చేస్తాం. బిహార్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం. ఎన్డీఏ పక్షాలన్ని ఏకతాటిపైకి రావడం సంతోషం. ప్రధానిగా మోదీ ఆదివారం ప్రమాణం చేస్తున్నారు. కానీ ఇవాళ్లే ప్రమాణ స్వీకారం చేయాలని కోరుకుంటున్నా. ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేసినా మీతోనే నడుస్తాం” అని నితీశ్ పేర్కొన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో లోక్ సభ పక్ష నేతగా నరేంద్ర మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, చంద్రబాబు, నితిన్ గడ్కరీ, నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కళ్యాణ్ తదితరులు బలపరిచారు.

## మళ్లీ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ షురూ

నిజామాబాద్, జూన్ 7 : తెలంగాణలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడటం, మళ్లీ లోక్ సభ ఎన్నికలు రావటంతో ఈ ప్రక్రియ ముందుగా సాగలేదు. అయితే జూన్ 6వ తేదీతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఎత్తివేయనున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఈ ప్రక్రియ షురూ కానుంది.ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం కీలక అప్డేట్ ఇచ్చారు. సోమవారం పాలిసెట్ ఫలితాల విడుదల అనంతరం? మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఒకటి, రెండు రోజుల్లో తిరిగి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇదే నెలలో ఈ ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లోనే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 12న బడులు పునఃప్రారంభమవుతన్న సంగతి తెలిసిందే. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేసింది. జూన్ 12, 2024 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. 2025, ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి.




అక్టోబర్ 2 నుంచి 14 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. డిసెంబర్ 23 నుంచి 27 వరకు 5 రోజుల పాటు క్రిస్మస్ సెలవులు కాగా, వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. 2025, ఫిబ్రవరి 28లోపు పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

# బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ



వేములవాడ పట్టణ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్ తండ్రి కందుల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, పట్టణ కౌన్సిలర్ జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేష్, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ ఛైర్మెన్ రామ్ మోహన్ రావు, నాయకులు వాసాల శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, సుంకపాక రాజు, సందీప్, ఆంజద్ పాషా, ఉమర్, రాము, ప్రమోద్, రాకేష్, పర్వేజ్, సాయి, తదితరులు ఉన్నారు.

# పాఠశాలల్లో తుది దశ పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల, జూన్ 7 : అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టి, తుది దశలో ఉన్న మరమ్మతు పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై జిల్లాలోని ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అదనపు కలెక్టర్ పి. గౌతమితో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటివరకు ఎన్ని పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగితా పనులు త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.హా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు, మరుగుదొడ్ల లో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని వివరించారు. తుది దశకు చేరుకున్న పనులను నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్డీఓ శేషాద్రి, డీఈఓ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పడి లేచిన ఆ ముగ్గురు



**హైదరాబాద్ , జూన్** :అసెంబ్లీ ఎన్నికలలో బరిలో నిలిచి ఓడిపోయిన ముగ్గురు బీజేపీ లీడర్లు.. పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి పార్లమెంటులో అడుగు పెట్టబోతున్నారు. ఆ ఇద్దరూ నేతలు తమ సిట్టింగ్ స్థానాలు నిలబెట్టుకోగా, మరోకరు కొత్తగా పార్లమెంటులో అడుగుబెట్టబోతున్నారు. కరీంనగర్ ఎంపీగా రెండవసారి భారీ మెజారిటీతో గెలుపొందారు బండిసంజయ్. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా బిజేపి పార్టీ బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు ఆయన. ప్రజాసంగ్రామ యాత్రతో అప్పటి బీఅర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చెయడంలో సక్సెస్ అయ్యారని చెప్పుకోవచ్చు. 2018లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన బండిసంజయ్ ఓటమి చెందడంతో తరువాత జరిగిన పార్లమెంటు ఎన్నికలో భారీ మెజారిటితో గెలుపొందారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేసి కార్యకర్తల్లో జోష్ తీసుకువచ్చి బీజెపికి మంచి ఊపు తీసుకువచ్చారు. బండిసంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే హుజురాబాద్, దుబ్బాక బై ఎలక్షన్స్లో బిజేపి ఘన విజయం సాధించింది. 2023 అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సరికి పార్టీ అధ్యక్షుడు నుండి జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో కరీంనగర్ అసెంబ్లీకి పోటి చేసారు. స్టార్ క్యాంపెయినర్?గా రాష్ట్రం అంతా విస్తృత ప్రచారం చేస్తునే పార్టీ అధిష్టానం అదేశాల మేరకు కరీంనగర్ అసెంబ్లీకీ పోటి చేసారు. అప్పటి మంత్రి గంగుల కమలాకర్ చేతిలో స్వల్ప మెజారిటీతో ఓటమి చెందినా ఇప్పుడు జరిగిన పార్లమెంటు ఎన్నికలలో రికార్డు మెజారిటీతో గెలిపొందారు. కరీంనగర్ పార్లమెంటు చరిత్రలోనే అత్యధికంగా 2,25,209 మెజారిటీతో గెలుపొందారు.ఇక ఈటెల రాజేందర్ కమలాపూర్ నియోజకవర్గం, హుజురాబాద్ నియోజకవర్గాల నుండి వరుసగా గెలుస్తూ వస్తున్నారు. 2023 నవంబర్?లో జరిగిన శాసనసభ ఎన్నికలలో హుజురాబాద్, గజ్వేల్ రెండు నియోజకవర్గాలలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసారు. రెండు నియోజకవర్గాలలో కూడా నిరాశ ఎదురయింది. కమలాపూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల నుండి వరుసగా ఏడుసార్లు గెలిచారు ఈటెల. కేసీఆర్?ను విభేదించి బిజేపిలో చేరిన ఈటెలని భారీ మెజారిటీతో గెలిపించారు హుజురాబాద్ ఓటర్లు. ఉప ఎన్నికల తరువాత హుజురాబాద్ పట్టించుకోక పోవడంతో పాటుగా బీఅర్ఎస్ అభ్యర్థి సానుభూతి ఏర్పాడటం ఈ రెండూ కలిసి వచ్చాయి. ఈటెల రాజేందర్ గజ్వేల్, హుజురాబాద్?లలో పోటీ చేయడంతో హుజూరాబాద్?లో క్యాంపెయింగ్ సరిగా చేయక పోవడంతో ఓటమి చెందారు. హుజురాబాద్?లో ఓడినా తన పట్టు నిలుపుకునేందుకు భారతదేశంలోనే అతిపెద్ద నియోజకవర్గం మల్కాజ్గిరి నుండి భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ఆరు నెలల ముందు నుండే మల్కాజ్గిరిలో వివిధ కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్న రాజేందర్ ఏకంగా 3,91,475 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.ధర్మపురి అరవింద్ గత పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ నుండి అనూహ్యంగా టికెట్ దక్కించుకుని కేసిఆర్ కూతురు, అప్పటి స్థానిక ఎంపి కవితపై భారీ మెజారిటీతో గెలుపొందారు. పసుపుబోర్డు తీసుకువస్తానని.. లేకుండా తాను రాజీనామా చేస్తానని బాండ్ పేపర్?పై సంతకం చేసి కవిత?పై విజయం సాధించారు. అనుకున్న విధంగానే కేంద్రాన్ని ఒప్పించి పసుపుకి సంబంధించిన స్పైస్ బోర్డుని తీసుకువచ్చారు. అయితే బిజేపి అధిష్టానం కొరుట్ల నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అదేశించడంతో కొరుట్ల నుండి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటిచేశారు. కోరుట్ల ఫలితం కలిసిరాకున్నా.. ఇప్పుడు నిజామాబార్ ఎంపిగా రెండవసారి పోటీ చేసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డిపై గెలుపోందారు. రెండవసారి పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారు అర్వింద్. ఈ ముగ్గురు బిజెపి సీనియర్ నేతలు అప్పుడు అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి చెందినప్పటికీ.. ఇప్పుడు జరిగిన పార్లమెంటు ఎన్నికలలో భారీ విజయాలు సాధించారు.

# నేడు మృగశిర కార్తె ప్రారంభం




జూన్ 8 నుంచి మృగశిర కార్తె ప్రారంభం కానుంది. ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగివుంది. రోళ్లు పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణికార్తె ముగిసి.. చల్లబరిచే మృగశిర మొదలవుతుంది. మృగశిర కార్తె అంటే.. ఆశ్విని మొదలుకుని రేవతి వరకూ మనకున్న 27నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం జరుగుతుంది. భారతీయ జ్యోతిష సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటి నుంచి నైరుతి రుతుపనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారి చల్లబడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మక్రిములు వంటివి పునురుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా, మధుమోహ వ్యాధి ఉన్న వారు, గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనిషి శరీరంలో మార్పులు జరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. గుండెజబ్బులు, ఆస్తమా తదితర అనారోగ్యసమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాల్సిందే. అసలు మృగశిర కార్తెకు ఉన్న సంబంధం ఏమిటి..?వ్యాధుల నియంత్రణకు చేపలు మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? రోకండ్లను సైతం పగులగొట్టే ఎండలు తగ్గిపోతాయి. వర్షాలు మొదలవుతాయి. 15 రోజుల పాటు ఈ కార్తె ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి ఆనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ క్రమంలో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఇదేకాక ఈ సీజన్లోచాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు బారిన పడతారు. ఇలాంటి నుంచి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే.పూర్వీకులు శాఖాపరమైన ఇంగువను బెల్లంలో కలుపుకొని ఉండలు.. ఉండలుగా చేసుకుని తినేవారు. మాంసాహారులైతే చేపలను ఇంగువలో, చింత చిరుగులో పెట్టుకుని తినేవారు. ఈ రోజు ఏ ఇంటా చూసినా చేపల పులుసే. చేపల కూర వంటకాలే కనిపిస్తుంటాయి. పులుసో, ఫ్రై చేసుకుని ఖచ్చితంగా తింటుంటారు. చేపలలో పోషకాలు: చేపలలో ఎన్నో పోషకాలున్నాయంటున్నారు వైద్య నిపుణులు. చేపలలో అనేకమైన మాంసకృతులతో పాటు శరీరానికి మేలు చేసే గుణాలు ఎన్నో ఉన్నాయి. కాల్షియం, పాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. చేపలు కొవ్వులు చాలా సులభంగాజీర్ణమై శక్తిని అందిస్తాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా తినవచ్చు. చేపల్లో ఉన్న కొవ్వు మన శరీరంలో రక్త పీడనంపై మంచి ప్రభావం చూపుతాయి. ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలలో డీహెచ్ఏ, ఈపీఏ వంటివి కంటి చూపునకు ఎంతో మేలు చేస్తాయి. అలాగే జ్ఞాపకశక్తిని కూడా పెంచుతాయి. చేపల్లో బీ12 విటమిన్, రైబోఫ్లవిన్, నియాసిన్, బయెటిక్, థయామిన్ తదితర విటమిన్లు లభిస్తాయి. సముద్ర చేపల కాలేయంలో విటమిన్ఏ,డీ, ఈ వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. చేపలు గుండెకు సంబంధిత వ్యాధులకు, ఆస్తమా, షూగర్ వ్యాధి గ్రస్తులకు మంచి ఆహారంగా పని చేస్తుంది.

# యుద్ధ ప్రాతిపదికన బ్యారేజ్ పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి : రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




సిరిపురం, మంథని, జూన్ -07: సుందిళ్ళ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మూడు బ్యారేజ్ ల సందర్శనలో భాగంగా శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను సందర్శించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను ఆసాంతం మంత్రి పరిశీలించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ప్రతి పనికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తి చేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని మంత్రి ఆదేశించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ సమీపంలో గల పంప్ హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రివర్యులు తో కలిసి అంచనా వేసి వాటి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. ప్రాజెక్టు ఈ.ఎన్.సి అనిల్ కుమార్ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. రాబోయే వానాకాలంలో మూడు బ్యారేజీల సంరక్షణకు, తదుపరి ఎటువంటి డ్యామేజీ జరగకుండా పనులు చేపట్టామని ఈఎన్సీ తెలిపారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని , జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజ్ ఎటువంటి మరమ్మత్తుకు గురికాకుండా సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, మంత్రి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని ఈఎన్సీ అన్నారు. అనంతరం మీడియాతో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మత్తులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందని అన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన మధ్యంతర నివేదిక ప్రకారం రాబోయే వానా కాలంలో మూడు బ్యారేజీల సంరక్షణ కోసం పనులు చేపట్టామని, క్షేత్రస్థాయిలో బ్యారేజీలను పరిశీలించి ఆ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీలను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జ్ జస్టిస్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుందని మంత్రి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం భూపాల్ పల్లి జిల్లాలో ఉన్న అన్నారం(సరస్వతి) బ్యారేజీ సందర్శనకు మంత్రి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఎన్.సి జనరల్ జి.అనిల్ కుమార్, ఎస్.ఈ.ఏం. కరుణాకర్, ఈ.ఈ. సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటీ పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ -I పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూన్ -07: జూన్ 9న ఆదివారం ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 1-00 గంట వరకు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో, ముందస్తుగా పరీక్ష సెంటర్లకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-00 గంటల నుండి 10-00 వరకు పరీక్షా సెంటర్ లోనికి అనుమతి ఉంటుందని, 10 గంటల సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని, అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫోటో ఐ.డి. గుర్తింపు కార్డ్ తీసుకొని రావాలని సూచించారు. బయోమెట్రిక్ 9-30 గంటల నుండి ప్రారంభించబడునని, అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రం వదిలి వెళ్లరాదని, అభ్యర్థులు చేతి వేళ్ళపై ఎలాంటి మెహంది, టాటూలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరిక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు తమ హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అతికించాలని, ఈ ఫోటో 3 నెలల లోపు దిగినదే అయి ఉండాలన్నారు. హాల్ టికెట్ పై ఫోటో అతికించకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడరని, ఈ నిబంధనను హాల్ టికెట్ లో పొందు పరిచినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో 6098 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాల్లోకి వెళ్ళే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ లు, చేతి గడియారాలు వెంట తీసుకొని రావద్దని, పరీక్షా కేంద్రములోకి వెళ్ళిన అభ్యర్థి పరిక్షా సమయం ముగిసేంతవరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్ళుటకు అనుమతించబడరని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# క్రీడాలతో మానసిక ఉల్లాషం - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



క్రీడాలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఉంటుందని ప్రభుత్వ విప్ ,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.. శుక్రవారం వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్ సౌజన్యంతో సాయి క్రికెట్ టీం వారి ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలను ప్రభుత్వ విప్ ప్రారంభించారు.. వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు..గ్రామాల్లో గతంలో కబడ్డీ కోకో వాలీబాల్ వంటి క్రీడలను ఆడే వాళ్ళమన్నారు.. నేడు ఆధునిక ప్రపంచంలో క్రికెట్ విశ్వవ్యాప్తంగా అందరూ ఆదరిస్తున్నారని అన్నారు.. క్రీడలు అడటడం వలన సమస్యలను అధిగమించే ఒక శక్తి ఏర్పడుతుంది,క్రీడాకారుల మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు..యువత గ్రామాల్లో క్రికెట తో పాటు ఇతర క్రీడల్లో రాణించాలని అన్నారు.. మన ప్రాంతంలోని క్రీడాకారులకు ఉపయోగపడేల అసంపూర్తిగా ఉన్న మిని స్టేడియాన్ని యుద్ధ ప్రతిపాదికన త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు..గత కాంగ్రెస్ పార్టీ హయంలో నిధులు మంజూరు అయ్యాయన్నారు..మినీ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన క్రీడ సామాగ్రిని అందుబాటులోకి తెస్తాం అన్నారు.. వేములవాడ పట్టణ యువకులకు క్రికెట్ ఆడటానికి మైదానం కావాలంటే మర్రిపెల్లి ప్రాంతంలో మైదానానికి స్థల పరిశీలన జరుగుతుందన్నారు..ప్రభుత్వంఅన్ని గ్రామాల్లో ఓపన్ జిమ్ లను ఏర్పాటు చేస్తుందన్నారు..దేశ భవిష్యత్తు నేటి యువత చేతిలో ఉందని చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్,గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తోందన్నారు... క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు..

# ప్రైవేట్ హాస్పిటల్స్ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలి : కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, జూన్ 7 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం తప్పనిసరిగా రాష్ట్ర అగ్ని మాపక శాఖ నుంచి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 144 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఆయా దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ వెబ్సైట్ లో తమ హాస్పిటల్ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ లో వివరాలు నమోదు చేసిన అనంతరం అగ్ని మాపక శాఖ వారితో ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకొని ఫైర్ శాఖ ద్వారా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.